సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



'ఆయా'సమే మిగులుతోంది

స్కూళ్లలో ఆయాలకు ఆయాసమే మిగులుతోంది. వేతనాలు పడడం లేదు.

- 8లో



ఈ క్రాప్ నమోదుకు..


ఈ క్రాప్ నమోదు మొదలైంది. దీని ఆధారంగానే పథకాలు ఇవ్వనున్నారు.

- 8లో

శాసన మండలి చైర్మన్ రాక నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాసనమండలి చైర్మన్ కొయ్య మోషేన్ రాజు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మంగళవారం పర్యటించనున్నారు. కవిటి మండలంలోని స్థానిక శాసనమండలి సభ్యులు నర్తు రామారావు స్వగృహానికి వస్తున్నట్లు మండలి చైర్మన్ కార్యాలయం పర్యటన వివరాలతో ప్రకటన విడుదల చేసింది. మంగళవారం ఉదయం 10 గంటలకు నర్తు రామారావు ఇంటికి చేరుకొని ఆయనతో సమావేశం కానున్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళంలో బస చేసి, బుధవారం భీమవరం చేరుకోనున్నారు.

అప్రకటితం



జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి చడీచప్పుడు లేకుండా కరెంటు ఆగిపోతోంది. మండల కేంద్రాల్లో విడతల వారీగా ఓ రెండు గంటల పాటైనా విద్యుత్ అంతరాయం కలుగుతోంది. ఇదేమీ వేసవి కాదు.. భయంకరమైన నీటి కొరతా లేదు. అయినా విద్యుత్ కోతలు వేధిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత వానాకాలంలోనూ కరెంటు కష్టాలు తప్పడం లేదు. విద్యుత్ శాఖాధికారులు చెప్పడానికి మొహమాట పడుతున్నా.. జనం మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోతలు
- అర్ధరాత్రి సమయంలో విద్యుత్ నిలిపేస్తుండటంలో ప్రజలకు తప్పని అవస్థలు
- వైద్యారోగ్య కేంద్రాల్లో సేవలకు అంతరాయం

- అనధికారికంగా అమలు చేస్తున్న విద్యుత్ కోతలతో సోమవారం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి స్కానింగ్ సెంటర్ సేవలకు అంతరాయం ఏర్పడింది. తరచూ విద్యుత్ నిలిచిపోయి రావడంతో సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రేలు తీసేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జనరేటర్ సౌకర్యం ఉండటంతో వెంటనే విద్యుత్ పునరుద్ధరించినా ఈలోపు అంతరాయం తప్పని పరిస్థితి ఏర్పడింది. కంప్యూటర్లతో సంబంధం ఉండటంతో ఆఫ్,ఆన్ అయ్యేసరికి సమయం పడుతోంది.



- కలెక్టరేట్‌లో కూడా ఇదే రకంగా జరిగింది. కలెక్టర్లతో సీఎం సమీక్ష సమావేశం జరుగుతుండగా జిల్లా అధికారులంతా అందుబాటులో ఉండేలా జేసీ ఆదేశాల మేరకు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అంతా వేచి ఉన్నారు. ఈ సమయంలో అనేకసార్లు విద్యుత్ పోయి, రావడం జరిగింది.



- ఆదివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో శ్రీకాకుళం గైనేటి వీధి ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒంటి గంటకు వచ్చింది. మళ్లీ పది నిమిషాల తర్వాత ఆగిపోయింది. తదుపరి 15 నిమిషాలకు వచ్చింది. ఇలా వచ్చి పోవడంతో ప్రజలు నరకయాతన అనుభవించారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

వేసవి వస్తే విద్యుత్ కోతలు పెరుగుతుంటాయి. కానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరాక వానాకాలంలోనూ ఆశ్చర్యకరంగా విద్యుత్ కోతలు వేధిస్తున్నాయి. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో వేసవిలోనూ లేనంతగా ఇప్పుడు పవర్ కట్‌లు పెరిగాయి. పోనీ వర్షాభావ పరిస్థితులతో ఉత్పత్తి తగ్గిపోయిందనకుంటే అలాంటి పరిస్థితుల్లేవు. పెద్దగా గాలులు వీచి ముందస్తుగా ఆపేస్తున్నారు అనుకుంటే అదీ లేదు. అసలు విషయం బయటకు చెప్పకుండా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంపై జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు వేధిస్తున్నాయి. పావు గంట, అర్ధగంట, గంట ఇలా దశల వారీగా నిలిపేస్తుండటంతో రోజుకి మూడు నుంచి నాలుగు గంటలు విద్యుత్ లేని పరిస్థితులు ఉన్నాయి. మండల కేంద్రాల్లో ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఐదారు గంటల కోతలు నడుస్తున్నాయి.



- రణస్థలం మండలంలో ప్రతి రోజూ అర్ధగంట.. గంట అంటూ రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు పాటు విద్యుత్ కోతలు నడుస్తున్నాయి.
- ఎచ్చెర్ల, జలుమూరు, పాతపట్నం, పలాస, శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, మెళియాపుట్టి, హిరమండలం, నరసన్నపేట, సారవకోట, ఎల్ఎన్‌పేట, ఇచ్ఛాపురం...ఇలా ఒక్కో మండలంలో ఒక్కో సమయంలో అనధికారికంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు.
- మండలాలతో పాటు జిల్లా కేంద్రంలోనూ ఒకేసారి నిలిపేస్తే ప్రజల్లో ఒక్కసారి వ్యతిరేకత వస్తుందని ఒక్కో మండలంలో ఒక్కో చోట ఒక్కో సమయంలో అప్రకటిత కోతలు పెడుతున్నారు.
- ఇది సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం కావడంతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ముఖ్యంగా డెంగీ, మలేరియా దోమల వల్ల ఇబ్బందులు తప్పవేమోనని భయపడుతున్నారు.

ఏం చెప్పారు.. ఏం చేస్తున్నారు.?

నాణ్యమైన విద్యుత్, కోతల్లేకుండా అందిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చెప్పింది. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఊదరగొట్టింది. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. వర్షాకాలంలో రోజుకి మూడు నాలుగు గంటలు విద్యుత్ కోతలు వేధిస్తుంటే వేసవి కాలంలో ఇంకెలాంటి భయంకర పరిస్థితులు వస్తాయోనని జనం భయపడుతున్నారు. హామీలిచ్చిన పథకాలను గాలికొదిలేసినట్టే.. నాణ్యమైన విద్యుత్, కోతల్లేకుండా సరఫరా అనేది కూడా మరుగున పడిపోయేలా ఉంది. నడుస్తున్న అప్రకటిత కోతలపై విద్యుత్ శాఖాధికారులను అడిగితే ఒక్కొక్కరు ఒక్కో రకంగా సమాధానం చెబుతున్నారు. ఎల్‌సీ, ట్రిప్పు, బ్రేక్‌డౌన్ రూపంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఒకరు, రోజుకి గంట పాటే సరఫరా నిలిచిపోతుందని మరొకరు చెప్పుకొస్తున్నారు. జిల్లా ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి మాత్రం అబ్బే అలాంటిదేమీ లేదని కొట్టి పారేస్తున్నారు. చెట్లు కొమ్మలు పడిపోయినప్పుడు, ఇంకేమైనా అనివార్య కారణాలతో అక్కడక్కడ సరఫరా ఆగి ఉండొచ్చేమో కాని జిల్లాలో ఎక్కడా విద్యుత్ కోతలనేవే లేవని చెబుతుండడం గమనార్హం.

దాడులతో విధ్వంసం సృష్టిస్తున్నారు

- దాడులు చేయడంపై ఉన్న శ్రద్ధ.. పాలనపై పెట్టాలి
- మీడియా సమావేశంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : రాష్ట్ర ప్రజలు కూటమిని నమ్మి ఓట్లేస్తే సంక్షేమ పాలన అందించాల్సింది పోయి అధికారం చేపట్టిన తొలిరోజు నుంచే హత్యలు, దౌర్జన్యాలు, దాడులతో ప్రజల్ని భయాందోళనకు గురిచేయడం తగదని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీకాకుళంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నారా లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో హత్యలు చేయించి ప్రజా గొంతుని నొక్కేయాలని చూస్తే ఎవరూ ఊరుకోరన్నారు. మొన్న గుంటూరులో రఫీ, నిన్న సుబ్బారాయుడు ఇలా రోజుకొకరిని చంపేసి ప్రజాస్వామ్యాన్ని మంటగలుపుతున్నారని మండిపడ్డారు. ఎంపీకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తాను గతంలో చంద్రబాబు కేబినెట్‌లో పనిచేశాను కానీ ఇలాంటివి ఎప్పుడూ లేవన్నారు.

ఓటాన్ అకౌంట్ ఏడునెలలకివ్వడమా..

అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చేందుకు తగిన నిధులు సమకూర్చుకోవాలే తప్ప అప్పులున్నాయని ప్రజలకు దొంగలెక్కలు చెప్పి మోసగించడం సరికాదన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనే కాదు దేశంలో ఏడు నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఎప్పుడూ ఇవ్వలేదన్నారు. ఎన్నికల దగ్గర నుంచి చంద్రబాబు రూ.14 లక్షల కోట్ల అప్పులున్నాయని పత్రికలకు లీక్‌చేసి అధికారంలోకి వచ్చాక సూపర్‌సిక్స్‌ను అమలుచేయకుండా చేసేందుకే అప్పులు చూపిస్తున్నారన్నారు. గవర్నర్ ప్రసంగంలో అప్పులు రూ.10 లక్షల కోట్లుగా చెప్పించిన ఘనుడు, ఎవరితోనైనా అబద్ధాలు చెప్పించగల సమర్థుడు చంద్రబాబు అని అన్నారు. జూన్ 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసినప్పటికి కేంద్రం నుంచి వచ్చిన నిధులతో సహా రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ 7.8 వేల కోట్ల డబ్బులు ఉన్నాయన్నారు. కానీ హామీలు అమలుచేయకుండా మోసగించేందుకే ఫుల్‌టైం బడ్జెట్ పెట్టలేదన్నారు.

సంక్షేమ పథకాలన్నీ గోవిందా..

హామీలపై ప్రజలు నిలదీస్తారనే ఇప్పుడు తప్పుడు పత్రాలు విడుదల చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ కావాలని కేంద్రం అడిగితే ప్యాకేజీకే బాబు మొగ్గు చూపారని అన్నారు. కమీషన్ల కక్కుర్తితో పోలవరంను కేంద్రం నుంచి తీసుకున్నది కూడా బాబేనన్నారు. పోలవరం స్పిల్‌వే నిర్మించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని గుర్తుచేశారు. కాపర్‌డ్యాంను ముందుగా కట్టడం వ్యూహాత్మక తప్పిదమన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై డ్రామాలు సరికాదు..

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై బాబు దుష్ప్రచారం చేశారని, రీ సర్వే చేసిన భూములకు ప్రపంచ బ్యాంకు నుంచి డబ్బులు వస్తాయని తెలుసుకుని ఇప్పుడు దానిపై యూటర్న్ తీసుకుంటున్నారని వివరించారు. ప్రస్తుతం ఉన్న మద్యం బ్రాండ్‌లన్నింటికీ 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబే అనుమతులిచ్చారని తెలిపారు. బాగా తాగి పడిపోయిన వాడు కూడా చంద్రబాబులా అబద్ధాలు చెప్ప డని దుయ్యబట్టారు. తమ హయాంలో 43 వేల బెల్ట్‌షాపులను రద్దుచేశామని, కొత్తగా బార్లకు లైసెన్స్ ఇవ్వలేదన్నారు. డిస్టిలరీలకు కూడా అనుమతివ్వలేదని చెప్పారు. ఇసుక ఫ్రీ అంటూ తెలుగు తమ్ముళ్ల జేబులు నింపే పని ఇప్పటికే ప్రారంభించేశారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు పాల్గొన్నారు.

వంశధార కాలువపై అనధికార వంతెన



లేఅవుట్‌కు ఆనుకొని సాగునీటి కాలువపై అక్రమంగా నిర్మించిన వంతెన

సంతబొమ్మాళి: తాను వేసిన లే అవుట్‌కు దారి లేకపోవడంతో ఓ రియల్టర్ ఏకంగా వంశధార కాలువ పైనే అక్రమంగా వంతెన నిర్మాణం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంతబొమ్మాళి పంచాయతీ జగన్నాథపురం వద్ద సర్వే నంబర్ 190–1లో 58 సెంట్లు విస్తీర్ణంలో లేఅవుట్ వేశారు. లేఅవుట్‌కు దారి లేకపోవడంతో పక్కన ఉన్న వంశధార కాలువ పై రియల్టర్ కన్ను పడింది. సాగునీటి కాలువలపై ఎలాంటి నిర్మాణాలు చేయాలన్నా సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకుని నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టాలి. అయితే రియల్టర్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సాగునీటి కాలువపై సిమెంట్ వంతెన నిర్మాణం చేపట్టి తన లేఅవుట్‌కు దారిని ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సాగునీరుతో పాటు నాలుగు మండలాల నుంచి వచ్చే వర్షపునీరు ఈ సాగునీటి కాలువ ద్వారా ప్రవహించి కాకరపల్లి తంపర ద్వారా సముద్రంలో కలుస్తుంది. ఈ ప్రాంతం ముంపు ప్రాంతం కావడంతో గతంలో ఎన్నో సార్లు పంట పొలాలు వర్షాకాలంలో నీట మునిగాయని ఇప్పుడు నీటి ప్రవాహానికి అడ్డంగా కాలువపై వంతెన నిర్మాణం చేయడం వల్ల మరింత ఇబ్బంది కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నీటిపారుదలశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ వంతెనకు ఎలాంటి అనుమతులు లేవని వంశధార ఏఈ వి.సింహాచలం తెలిపారు. నిర్మాణాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మెట్టవలసపై అతిసార పంజా

- 47కు చేరిన బాధితుల సంఖ్య
- శ్రీకాకుళం, రాజాం, పొందూరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు



గ్రామంలోనే రోగులకు వైద్యసేవలను అందిస్తున్న వైద్యులు యశ్వంత్, సుమబిందు

జి.సిగడాం:

మండలంలోని మెట్టవలస గ్రామాన్ని అతిసార వ్యాధి వణికిస్తోంది. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో ఊరంతా ఆందోళన చెందుతోంది. సోమవారం నాటికి బాధితుల సంఖ్య 47కు చేరింది. వీరిలో 32 మందిని శ్రీకాకుళం, రాజాం, పొందూరు ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. రాజాం సామాజిక ఆస్పత్రిలో 24 మంది, పొందూరు ఆస్పత్రిలో ఇద్దరు, శ్రీకాకుళంలో ముగ్గురు చొప్పున చికిత్స పొందుతున్నారు. మరో 20 మంది గ్రామంలోనే చికిత్స తీసుకుంటున్నారు. వీరికి స్థానిక వైద్యాధికారులు బుడుబూరు యశ్వంత్, పేకల సుమబిందు వైద్యసేవలు అందిస్తున్నారు.

ఇంటింటా సర్వే..

మెట్టవలస గ్రామంపై అతిసార వ్యాధి పంజా విసరడంతో వైద్యసిబ్బంది ఇంటింటా వెళ్లి సర్వే చేస్తున్నారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మూడు టీములుగా ఏర్పాటై ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు. గ్రామంలో 75 ఏళ్ల పైల సావిత్రమ్మ ఇంటి వద్దనే మృతి చెందారు. దీనిపై వైద్య అధికారులను వివరణ అడగగా వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందిందని బదులిచ్చారు. స్థానిక సర్పంచ్ కామోజుల ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి, నాయకులు బెవర జగన్నాథం, కామోజుల సీతారాం, పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజారమేష్, ధర్మవరపు సతీష్ పర్యవేక్షణలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సోమవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఉన్న బోర్లన్నీ నిలుపుదల చేసి, రాజాం మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. అనంతరం రాజాంలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు.



బోరును పరిశీలిస్తున్న అధికారులు

యువగళం హామీలు నెరవేర్చాలి



ఇన్‌చార్జి ఆర్డీఓ సుదర్శన్ దొరకు విన్నవిస్తున్న ఏబీవీపీ విద్యార్థి సంఘం ప్రతినిధులు

టెక్కలి : యువగళం పాదయాత్రలో నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు సోమవారం టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీ ఓ సుదర్శన్ దొరకు వినతిపత్రం అందజేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా జీఓ నంబర్ 77 తో పాటు మరికొన్ని విద్యార్థుల సమ స్యలపై హామీలు చేశారని, అధికారంలోకి వచ్చి 2 నెలలు గడుస్తున్నా వాటి కోసం ప్రస్తావించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ఎస్.మదన్‌కుమార్, కె.మురళి, ఎ.విశ్వనాథ్, కిశోర్‌కుమార్ తదితరులు డిమాండ్ చేశారు. అంతకు ముందు కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎల్‌సీడీసీ సర్వే 8 వరకూ పొడిగింపు



ఉర్లాం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా గత నెల 18 నుంచి నిర్వహిస్తున్న కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే ఈ నెల 8 వరకూ పొడిగించినట్లు అదనపు డీఎంహెచ్‌ఓ తాడేల శ్రీకాంత్ అన్నారు. సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి పీహెచ్‌సీలో ఎల్‌సీడీసీ సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో ఏ మేరకు సర్వే జరిగిందో వైద్యాధికారి సుజాతను అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రస్తుతం అంటువ్యాధుల కాలం అని, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు అన్ని రకాలుగా సేవలు అందించాలని, అవసరమైన వైద్య పరీక్షలు చేయాలని కోరారు. గ్రామాల్లో సిబ్బంది ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు అంటువ్యాధులపై సమాచారం తెలుసుకొని ప్రజలకు తగిన సూచనలు చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, ఈఓ గణపతిరావు, సూపర్ వైజర్ రమణమూర్తి తదితరులు ఉన్నారు.

గోగునారతో యువతకు ఉపాధి



మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ చిట్టిబాబు

ఆమదాలవలస: గోగు నారతో అనేక విలువాధారిత ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా యువతీ యువకులకు ఉపాధి చేకూరుతుందని స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ జి.చిట్టిబాబు అన్నారు. గోగు నారతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోగునారతో కాలికి వేసుకునే చెప్పుల నుంచి తలకు వేసుకునే టోపీ వరకు అనేక రకాల గృహోపకరణాలు తయారు చేసుకోవచ్చని అన్నారు. తయారు చేసిన వస్తువులకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉందన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఈ గోగు, జనపనారతో తయారు చేసిన అనేక రకాల ఉత్పత్తులను ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ బ్యాగులు తయారు చేసే విధానం అలాగే చేతి ఉత్పత్తుల తయారీపై ప్రత్యేకంగా మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా శాస్త్రవేత్త డాక్టర్ బి.స్వాతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జ్యోతి బసు, ఎన్జీవో ప్రతినిధులు ప్రకాష్ పాల్గొన్నారు

ముఖలింగేశ్వరుని గోలెంనకు ఇత్తడి కవచం



గోలెంనకు మొక్కులు తీర్చుతున్న పైడి రాజు కుటుంబ సభ్యులు

జలుమూరు: శ్రీముఖలింగం ప్రధాన ఆలయం గర్భగుడిలో ఉన్న గోలెంనకు విజయనగరానికి చెందిన యడ్ల పైడి రాజు సోమవారం ఇత్తడి కవచం బహూకరించారు. ముందుగా గణపతి పూజతోప్రారంభించి గోలెం నింపుగా బియ్యం వేసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పైడి రాజు కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించి పుణ్యాహ వచనాలతో దీవించారు. కార్యక్రమంలో అర్చకులు శేషాద్రివెంకటాచలం, సర్పంచ్ టి.సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ యోగీశ్వరరావు, మాజీ ఆలయ చైర్మన్ బలరామ్ ఉన్నారు.

కేజీబీవీలో కరిగిన గుడ్లు సరఫరాపై విచారణ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కేజీబీవీకి వెండర్ గత నెల 29న కరిగిన గుడ్లు సరఫరా చేశారు. ఈ ఉదంతంపై 'సాక్షి'లో 30న వార్త ప్రచురితమైంది. దీనికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించి సోమవారం విచారణ చేపట్టారు. సమగ్రశిక్షా ఏపీసీ రోణింకి జయప్రకాష్, కోటబొమ్మాళి కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతిలను పిలిచి జరిగిన ఉదంతంపై విచారణ చేశారు. నాణ్యత లేని గుడ్లను కేజీబీవీలోకి అనుమతించవద్దని, మరో సారి ఇలా జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని 25 కేజీబీవీల్లో వెండర్‌లు సరఫరా చేస్తున్న చికెన్, గుడ్లు, కూరగాయలను సంబంధిత ప్రిన్సిపాళ్లు పరిశీలించాలన్నారు.

సలక్షణ అలంకరణ



శ్రావణ మాసం మొదటి సోమవారం నాడు బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవ స్వామి పీఠం దేవాలయంలో అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించారు. ఐదు శుక్రవారాల్లోనూ సామూహిక కుంకుమ పూజలు చేస్తామని పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ తెలిపారు. - శ్రీకాకుళం కల్చరల్

వెలవెలబోయిన మీకోసం



వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ అప్పారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం వెలవెలబోయింది. కలెక్టర్ విజయవాడ ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరు కావడం, అదే కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ హాజరు కావడంతో ఉన్నతాధికారులు మీకోసంకు రాలేదు. దీంతో ఈ వారం మీకోసం వెలవెబోయింది. జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, తదితరులు ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 172 అర్జీలు అందాయి. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖ, డీఆర్‌డీఏ డ్వామా, విద్యాశాఖ, విద్యుత్, ల్యాండ్ సర్వే, పోలీసు, ఉద్యానవన వివిధ శాఖల ద్వితీయ శ్రేణి అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు



వృద్ధుని సమస్య వింటున్న అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు అందాయి. జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ జి.ప్రేమ్‌కాజల్ అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

- కజకిస్తాన్‌లో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని చెప్పి ఫీజులు ఎగ్గొట్టి మోసం చేసిన కరీంనగర్ వాసి హరీష్ గంగాధర్‌పై శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన విద్యార్థుల తండ్రులు మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంగాధర్ ఇప్పటికీ పిల్లలను బెదిరిస్తున్నాడని చర్యలు తీసుకోవాలని కోరారు.
- తనకు, తన పిల్లలకు భర్త గాలి పురుషోత్తం నుంచే కాక అతని ప్రియురాలు, ఆమె కుమారుడి నుంచి ప్రాణహాని ఉందని గాలి మీన అనే బాధితురాలు పోలీసులకు మొరపెట్టుకున్నారు. తన భర్తతో రెండేళ్ల కిందటి నుంచి ఓ మహిళ అక్రమ సంబంధం పెట్టుకుందని, వారిని నిలదీస్తే తనపై ఆ మహిళ సుత్తితో దాడి చేసిందని, ఒకానొక సమయంలో పిల్లలను కూడా కిడ్నాప్ చేశారని తెలిపారు. భర్తతో జాయింట్ అకౌంట్‌గా ఉన్న రూ. 3 లక్షలు కూడా ఇద్దరూ తీసుకుపోయారని, పిల్లలతో తన పోషణ కష్టంగా ఉందని న్యాయం చేయాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.
- తన బిడ్డ తనను పట్టించుకోవడం లేదని 75 ఏళ్ల వృద్ధుడు పోలీసులను ఆశ్రయించారు. బూర్జ మండలం తోటవాడ గ్రామానికి చెందిన సూర సూర్యనారాయణ గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చి మొరపెట్టుకున్నారు. పెద్ద కుమారుడు మురళి నరసన్నపేట మండలం బాలసీమ గ్రామం అత్తారింటికి వెళ్లి పదేళ్లుగా అక్కడే ఉండిపోయాడని అప్పటి నుంచి తన చిన్న కుమారుడే చూసుకుంటున్నాడని, తన తదనంతరం ఆస్తిని పంచుతానని చెబుతున్నా మురళి వేధిస్తున్నాడని సూర్యనారాయణ ఫిర్యాదులో పేర్కొన్నారు. బూర్జ పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. దీనిపై అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్ బూర్జ ఎస్ఐతో మాట్లాడి త్వరిత గతిన న్యాయం చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

ముఖలింగేశ్వరుని సన్నిధిలో శివస్వాములు



శ్రీముఖలింగేశ్వరుని ఆలయ ఆవరణలో ప్రదక్షిణలు చేస్తున్న శివ స్వాములు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని దర్శనానికి శివ స్వాములు పోటెత్తారు. శ్రావణ మాసం మొదటి సోమవారం కావడంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన శివస్వాములు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఒడిశా రాష్ట్రం బరంపురం, పర్లాఖిముండీ, గంజాం జిల్లా సత్రపూర్, బోగినిపేట, మండవానిపేట, భువనేశ్వర్ నుంచి వచ్చిన శివ స్వాములు ముందుగా వంశధార నదిలో స్నానాలు చేసి గణపతి పూజతో పూజలు ప్రారంభించారు. స్వామికి ఏకవారాభిషేకాలు, దర్శనాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే ఆలయ గర్భ గుడిలో ఉన్న గోలెంనకు మొక్కి అనంతరం వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం కాలినడకన టెక్కలి మండలం రావివలస వెళ్లారు.

సమాచార హక్కు చట్టం మీడియా జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్



దవళ శ్రీనివాస్

ఆమదాలవలస: సమాచార హక్కు చట్టం న్యాయపోరాట సమన్వయ కమిటీ ప్రజారక్షణ భేరీ మీడియా జిల్లా ఇన్‌చార్జిగా ఆమదాలవలసకు చెందిన దవళ శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు అయినా సమాచారం హక్కు కోసం తమ దృష్టికి తీసుకువస్తే న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

ఫొటో స్టూడియోలో చోరీకి విఫలయత్నం



ఫొటో స్టూడియోలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తి సీసీ పుటేజ్

టెక్కలి రూరల్: కొద్ది రోజులుగా టెక్కలిలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఆదివారం రాత్రి మరో చోట దొంగతనం చేసేందుకు ప్రయత్నించారు. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద ఉన్న ఒక ఫొటో స్టూడియోలోకి ఆదివారం రాత్రి ఒక వ్యక్తి వెళ్లి మొత్తం గాలించాడు. అక్కడ ఏమీ లేకపోవడంతో కౌంటర్‌లో ఉన్న కొంత డబ్బును తీసుకెళ్లిపోయాడు. షాపు వెనుక భాగం నుంచి లోపలకు ప్రవేశించినట్లు యజమాని తెలిపాడు.

ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే



బుడగుట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్‌కు కేటాయించిన స్థలం సర్వే చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం గ్రామంలో సోమవారం రెవెన్యూ అధికారుల సమక్షంలో ఫిషింగ్ హార్బర్‌కు కేటాయించిన ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 505/18లో ఫిషింగ్ హార్బర్ కోసం ప్రభుత్వం 40 ఎకరాలు కేటాయించింది. సరిహద్దుగా ఉన్న రణస్థలం మండలం కొమ్మరివానిపేటకు చెందిన కొందరు తమ రెవెన్యూ పరిధిలో అటవీ భూములు ఉన్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పనులు సైతం కొన్నాళ్లు నిలిపివేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ స్థలాన్ని ఈ నెల 3వ తేదీన పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, అటవీ, మత్స్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిషింగ్ హార్బర్ పనులు ప్రారంభించి, సమగ్ర సర్వే చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎచ్చెర్ల తహసీల్దార్ ఎ.సింహాచలం, రణస్థలం తహసీల్దార్ ఎన్.ప్రసాదరావుల పర్యవేక్షణలో సోమవారం సర్వేచేశారు. అటవీ శాఖ అధికారుల వద్ద ఉన్న డాక్యుమెంట్ల ఆధారంగా అటవీ స్థలం గుర్తిస్తున్నారు. ఈ స్థలం విడిచిపెట్టి నిర్మాణం చేపట్టనున్నారు.

ఉద్దాన తీర ప్రాంతంలో కుండపోత వర్షం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి ఉరుములు,మెరుపులతో పాటు వాన కురిసింది. ఉద్దాన తీర ప్రాంతమైన అనకాపల్లి, ఒంకులూరు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. దీంతో ప్రజలు భయంతో వణికిపోయారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంట సాగులకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆయాసమే మిగులుతోంది..!



మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న ఆయా



పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఆయా

- స్కూళ్లలో ఆయాలకు అందని వేతనాలు
- నాలుగు నెలలుగా చెల్లింపుల్లో జాప్యం
- వేతనాల కోసం 2764 మంది ఆయాల ఎదురు చూపులు

ఇచ్ఛాపురం రూరల్: సర్కారు బడుల్లో పనిచేసే ఆయాలకు ఆయాసమే మిగులుతోంది. ఏ ముహూర్తాన ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందో గానీ దాదాపు అప్పటి నుంచి వారికి వేతనాలు అందడం లేదు. కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. రెండు నెలలు వేసవి సెలవుల్లో, బడులు పునః ప్రారంభం అయి నేటికి రెండు నెలలు కావస్తున్నా పైసా ఇవ్వలేదని వారు ఆవేదన చెందుతున్నారు.

పాఠశాలల్లో గ్రీన్ అంబాసిడర్లుగా..

ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతే లక్ష్యంగా, విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'ఆయా'లను నియమించింది. పాఠశాలల్లో గ్రీన్ అంబాసిడర్లుగా వ్యవహరించే ఆయాలు రోజుకు రెండు పూటలా మరుగుదొడ్లను పరిశుభ్రం చేయడం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయడం, విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం కింద పడిన వ్యర్థ పదార్థాలు, తినుబండారాలను పరిశుభ్రం చేయడం, తరగతి గదులు పరిశుభ్రం చేయడం, పాఠశాలలో పెంచే మొక్కలకు నీరు పోయడం వంటి పనులు చేయాలి. 300 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒక ఆయా, 600 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఇద్దరు ఆయాలు, 600 నుంచి 900 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ముగ్గురు ఆయాలు, 900 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలో నలుగురు ఆయాలను అప్పట్లో నియమించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 2573 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 2764 మంది ఆయాలు పనిచేస్తున్నారు.

అప్పట్లో అమ్మ ఒడి నుంచి వేతనాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఆయాలకు నెలసరి అందించే వేతనాలను గతంలో ప్రభుత్వం అందజేసిన అమ్మ ఒడి పథకం నుంచి ఇచ్చేవారు. విద్యార్థికి అందించే రూ.15వేలలో రెండు వేల రూపాయలను పాఠశాల 'టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్'కు వినియోగించేవారు. ఈ ఫండ్ నుంచి ఒక్కో ఆయాకు రూ.6వేలు వేతనంగా, వేసవి సెలవుల్లో నెలకు రూ.3వేలు చొప్పున అందజేసేవారు. అంతే కాకుండా అదే ఫండ్ నుంచి మరుగుదొడ్లకు వినియోగించే ఉపకరణలు, ద్రావణాలకు ఖర్చు చే సేవారు. ఈ వేతనాలు గత ప్రభుత్వ హయాంలో మార్చి 2024 వరకు అందజేశారు. అనంతరం వేస వి సెలవులు రావడం, ఎన్నికల్లో కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో ఆయాలకు అందాల్సిన ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు సంబంధించి వేతనాలు ఇంత వరకు అందజేయలేదు.

అంతా అయోమయం

సూపర్ సిక్స్‌లో భాగంగా బడిలో ఎంత మంది చదివితే అంతమందికి తల్లికి వందనం పథకం పేరుతో ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఆ పథకాన్ని అమలు పరిచేలా లేదని మేధావులు చెబుతున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది రూట్ మ్యాప్ అమలు పరచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామంటూ వ్యాఖ్యానించడంతో ఆయాలు, ఉపాధ్యాయుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ఇప్పటికే నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, ఈ ఏడాది తల్లికి వందనం పథకం కూడా అమలు కాకపోతే వారికి వేతనాలతో పాటు మరుగుదొడ్లకు అవసరమైన వస్తువులు, ద్రావణాలు ఎలా కొనుగోలు చేసేదని ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఈ ఏడాది మార్చి నెల వరకు మాకు నెలనెలా జీతం ఇచ్చేవారు. ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నప్పటికీ పైసా కూడా జీతం అందలేదు. కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బడుల్లోనే పనులు చేసుకుంటూ ఉండాల్సిన పరిస్థితి మాది. బయట పొలం పనులకు వెళితే రోజుకు మూడు వందలు వరకు దొరుకుతోంది. అయినప్పటికీ ఇక్కడే ఉండి అప్పులు చేసి కుటుంబానికి తిండి పెట్టాల్సిన పరిస్థితిలో ఉన్నాం. ఇప్పటికైనా మాపై కరుణ చూపి వేతనాలు చెల్లించాలి.

– బర్రి లక్ష్మమ్మ, శశిబెహరా, ఆయాలు, మండపల్లి హై స్కూల్, ఇచ్ఛాపురం మండలం

అప్పు చేసి ఆకలి తీర్చుకుంటున్నాను



నాలుగేళ్లుగా ఇదే పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్నాను. నా భర్త మృతి చెందగా, కూతురికి పెళ్లి చేశాను. ప్రస్తుతం ఒంటరిగా ఉంటూ నెలకు వచ్చే రూ.ఆరువేలు జీతంపైనే ఆధారపడి బతుకుతున్నాను. నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో అప్పు చేసి కడుపు నింపుకుంటున్నాను. దయచేసి మాకు రావాల్సిన జీతాలు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

– సరస్వతి బెహరా, ఆయా, కొళిగాం హైస్కూల్, ఇచ్ఛాపురం మండలం

ఈ క్రాప్ నమోదుకు గ్రీన్ సిగ్నల్

- మండలాల్లో శిక్షణ తరగతులు ప్రారంభం
- సెప్టెంబర్ 15 నాటికి పంట నమోదు పూర్తి
- జిల్లాలో 1,82,325 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు



పంటల నమోదు చేస్తున్న వీఏఏ(ఫైల్)

నరసన్నపేట: పంటల నమోదు ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకూ గత ప్రభుత్వం అమలు చేసిన పంటల నమోదు ప్రక్రియను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా.. నూతన పద్ధతులు అమలు చేయనుందా అనే సందిగ్ధంలో వ్యవసాయ శాఖ అధికారులు ఉండే వారు. అయితే గత ప్రభుత్వం అమలు చేసిన పంటల నమోదు(ఈ–క్రాప్) ప్రక్రియనే కొనసాగించి తద్వారా ప్రభుత్వం నుంచి లబ్ధిని రైతులకు అందించేందుకు కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో పంటల విస్తీర్ణం లక్ష్యంగా పెట్టుకొని పంటల నమోదును విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు ఈ–పంట యాప్‌లో నమోదు చేయనున్నారు. గత ఖరీఫ్‌లో 92 శాతం ఈ–క్రాప్ నమోదు జరిగింది. దీని ఆధారంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లతో పాటు ఇతర పథకాలు అమలు చేసింది.

వన్‌బీ, ఆధార్ జిరాక్స్‌లు ఇవ్వాలి..

రైతులు రైతు సేవా కేంద్రాలకు వన్‌బీ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఫోను నంబరు తీసుకొని వెళ్లి ఏ పంట వేశారో దాన్ని నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. నమోదు చేసుకోని రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అమలు కావని హెచ్చరిస్తున్నారు. శనివారమే ప్రక్రియ మొదలు కాగా.. సెప్టెంబర్ 15 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం తేదీని ప్రకటించింది. జిల్లాలోని 30 మండలాల్లో 2024 ఖరీఫ్‌కు 1,82,325 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తితో పాటు ఇతర రకాలు పండించే అవకాశం ఉంది. మరో 15 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా వరి ఉభాలు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. సెప్టెంబర్ 15 కల్లా పంట నమోదు పూర్తి చేసి 19 నుంచి రైతు సేవా కేంద్రాల వారీగా సామాజిక తనిఖీలు(సోషల్ ఆడిట్) చేపట్టనున్నారు. గ్రామ సభల్లో అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రైతు సేవా కేంద్రాల్లో గ్రామ సభలు పెట్టి వచ్చిన అభ్యంతరాలు 25 నుంచి 29 వరకూ పరిష్కారం చేస్తారు. సెప్టెంబర్ 30న ఈ–క్రాప్ తుది ముసాయిదాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్ తెలిపారు.

ఉపాధ్యాయుని ఇంటిలో చోరీ



ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీస్వేచ్ఛావతి నగర్‌లో గల ఉపాధ్యాయుడు జె.ప్రకాశరావు ఇంటిలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జెడ్పీహెచ్ఎస్ మండపల్లిలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రకాశరావు శ్రీస్వేచ్ఛావతి నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు పిల్లలు విశాఖపట్టణంలో ఇంటర్ చదువుతున్నారు. సెలవు రోజుల్లో ప్రకాశరావు దంపతులు అక్కడకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం విశాఖపట్టణం వెళ్లి మళ్లీ సోమవారం ఉదయం ఇచ్ఛాపురం ఇంటి వద్దకు వచ్చేసరికి ఇంటి తలుపులు, వాటి గడియలు, కిటికీలు విరిగిపోయి కనిపించాయి. ఇంటిలోకి వెళ్లి చూస్తే బీరువా, కప్‌బోర్డులను తెరిచి అందులో ఉన్న సామాన్లు, బట్టలు చిందరవందరగా పడేసి ఉండడం గుర్తించారు. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో అవసరానికి తగ్గట్టుగా ఉంచుకొన్న కొంత సొమ్ము రూ.6వేలు, దేవుడికి కట్టిన ముడుపుల సొమ్ములను దుండగులు కాజేసినట్లు ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన కోళ్లకు పోస్టుమార్టం



రైతులతో మాట్లాడుతున్న మడపాం పశువైద్యాధికారి, సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని పోతయ్యవలసలో ఉన్నట్టుండి కోళ్లు మృతి చెందడంపై మడపాం పశు వైద్యాధికారి పాగోటి శ్రీవాణి గ్రామంలో పర్యటించి నాటు కోళ్ల పెంపకం రైతులతో మాట్లాడారు. సోమవారం గ్రామానికి వెళ్లిన ఆమె రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. 'కునుకుతూ మృతి చెందుతున్న కోళ్లు' అనే శీర్షికతో సాక్షిలో సోమవారం వార్త ప్రచురితం కావడంతో ఆమె స్పందించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతి చెందిన కోళ్లలో కొన్నింటికి పోస్టుమార్టం చేసి వ్యాధి గురించి తెలుసుకుంటామని చెప్పారు. ఈ మేరకు జేడీకి సమాచారం ఇచ్చామని, గ్రామంలో కోళ్లు అన్నింటికీ మందులు వేయనున్నాయని తెలిపారు. మృతి చెందుతున్న కోళ్లను ఆరుబయట వేయకుండా చిన్న గోతుల్లో పాతాలని ఆమె సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



మృతి చెందిన యశ్వంత్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం సమీపంలోని 16వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి దాటాక రెండు గంటలు సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి డొంక యశ్వంత్‌కుమార్ (32) అనే యువకుడు మృతి చెందాడు. ఇతని భార్య ఇప్పుడు ఏడు నెలల గర్భిణి. ఈ యువకుడు చిలకపాలెం కూడలిలో జాతీయ రహదారి పక్కన ఉన్న తమ మెకానిక్ షెడ్‌కు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో వెళ్లాడు. పని ముగించుకుని చిలకపాలెం గ్రామంలో ఇంటికి వస్తుండగా, రోడ్డు దాటే క్రమంలో శ్రీకాకుళం వైపు వస్తున్న వాహనం జాతీయ రహదారిపై ఢీ కొట్టింది. వాహనం ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. దీంతో రోడ్డుపై పడి ఉన్న యశ్వంత్‌కుమార్‌ను అటుగా వెళ్తున్న వారు గుర్తించి ఎచ్చెర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే యశ్వంత్ సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుని అన్న గోపి ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి రెండేళ్ల కిందట వివాహం కాగా, భార్య సీతామహాలక్ష్మి ఏడు నెలల గర్భిణి. యశ్వంత్ మృతితో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా

ఇచ్ఛాపురం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం సుమండి సమీపంలో జోగపురం, జట్టిపద్ర గ్రామాల కూడలి మలుపు వద్ద మండలంలోని ఎం.తోటూరు గ్రామానికి చెందిన ప్రైవేటు పాఠశాల బస్సు సోమవారం బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ఉండగా.. అంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఉదయం విద్యార్థులను స్కూల్‌కు తీసుకువస్తుండగా కూడలి మలుపులో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. రోజూ వెళ్లే డ్రైవర్ కాకుండా సోమవారం కొత్త డ్రైవర్ పనిచేయడం గమనార్హం. ప్రమాదం సంభవించిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పిల్లలను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎవరికీ పెద్ద గాయాలు కాలేదని వైద్యులు తెలిపారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని సుమండి సమీపంలో బోల్తా పడిన పాఠశాల బస్సు

స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్కీమ్ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపకుంటే పోరాటం ఉద్ధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద వర్షంలో సైతం నిరసన చేపట్టారు. ముందుగా ఆర్–బి రోడ్డు నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, వీఓఏలు (వెలుగు), ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, స్కూల్ స్వీపర్లు తదితర కార్మికులపై గ్రామాల్లో రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, రాజకీయ కక్షలతో అక్రమంగా తొలగిస్తున్నారని అన్నారు.

సంతబొమ్మాళి మండలంలోని గద్దెలపాడు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్, ఆయా, ఆశా, వీఓఏ, మధ్యాహ్న భోజన కార్మికులను తొలగిస్తామని చెబుతున్నారని, ఒక్కో ఉద్యోగానికి యాభై వేల నుంచి లక్షా 90 వేల వరకు వేలం పెట్టారని తెలిపారు. టెక్కలి–2 సెంటర్ అంగన్‌వాడీ వర్కర్‌ను, గార మండలం శ్రీకూర్మం పంచాయతీ ముద్దాడపేట గ్రామ మినీ అంగన్‌వాడీ వర్కర్‌ను, సంతబొమ్మాళి మండలం బోరుభద్ర పీహెచ్‌సీ పరిధిలో సీపురం గ్రామ ఆశ వర్కర్ బొంగు రాణిని, పలాస మండలంలో కిష్టుపురం గ్రామ, వజ్రపుకొత్తూరు మండలంలో కొండపల్లి ఆశ వర్కర్‌ను రాజీనామా చేయాలని బెదిరించారని తెలిపారు. పలాస మండలం కిష్టుపురం గ్రామంలో మధ్యాహ్నం భోజన పథకం వంట కార్మికురాలు బృందావతిని, నందిగాం మండలం కొత్తఅగ్రహారం ఎంపీయూపీ స్కూల్ మధ్యాహ్నం భోజన పథకం వంట కార్మికురాలు ఎం.సావిత్రిని అక్రమంగా తొలగించారని, మందస మండలంలో కుంటికోట, బెల్లుపటియా గ్రామాల వంటకార్మికులను వంట పని మానేయాలని, రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారని తెలిపారు.

వజ్రపుకొత్తూరు మండలంలో వీఓఏలను రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, ఆమదాలవలస మండలం నెల్లిపర్తి–1 సెంటర్ అంగన్‌వాడీ వర్కర్ ఎల్.మంగమ్మ, అక్కులపేట అంగన్‌వాడీ వర్కర్ రమణమ్మ, సరుబుజ్జిలి మండలం మతలబుపేట అంగన్‌వాడీ వర్కర్ ఎన్.పద్మకుమారి, యరగాం అంగన్‌వాడీ వర్కర్ ఎ.పార్వతీ, పర్వతాలు పేట ఎన్.శాంతమ్మలను తప్పుడు ఆరోపణలతో తొలగించారని, వారిని విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు. అనంతరం డీఆర్ఓ అప్పారావుకు వినతిపత్రం అందించారు.

అధునాతన హంగులతో సుజుకి అవెనిస్ 125



కొత్త వేరియెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మంచి మైలేజీతో పాటు, అధునాతన ఇంజిన్, హార్డ్‌వేర్‌ను కలిగిన సుజుకి అవెనిస్ 125 కొత్త రంగుల్లో మార్కెట్‌లోకి విడుదలైందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. స్థానిక పెద్దపాడు రోడ్డులోని సుజుకి మోటార్ సైకిల్ షోరూమ్‌లో న్యూ వేరియంట్‌తో కూడిన ఐదు కలర్ల సుజుకి అవెనిస్ 125 వాహనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఇప్పటికే ఈ వాహనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని, కస్టమర్ల కోరిక మేరకు ఐదు రంగుల్లో అందుబాటులోకి వచ్చాయని షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ అంధవరపు లక్ష్మణరావు తెలిపారు. స్కూటర్‌లో బ్లూటూత్ కనెక్టివిటీతో కూడిన డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, కాల్, ఎస్ ఎంఎస్, వాట్సాప్ హెచ్చరికలతో పాటు టర్న్–బై–టర్న్ నావిగేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయని చెప్పారు. స్కూటర్ సైడ్–స్టాండ్ కట్–ఆఫ్, యుఎస్‌బీ ఛార్జింగ్ సాకెట్, కాంబి బ్రేకింగ్‌తో కూడా వస్తుందన్నారు. కార్యక్రమంలో కోరాడ రమేష్, రెడ్డి శంకర్, షోరూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఘర్షణపై ఉప విద్యాశాఖాధికారి విచారణ

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారం రోజుల కిందట జరిగిన విద్యార్థుల ఘర్షణపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఉపవిద్యాశాఖాధికారి విజయలక్ష్మి పాఠశాలలో సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విచారించారు. ఘర్షణకు కారణాలు, దీనిపై హెచ్‌ఎం తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. హెచ్‌ఎం వెంకటరావు స్పందించకపోవడంతో డీవైఈఓ అసహనం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం స్పందనపై గాయపడిన విద్యార్థి తల్లిదండ్రులు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు. హెచ్‌ఎం పెట్టిన సెలవుపైనా ఆమె స్పందించారు. ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎవరికీ సెలవులు మంజూరు చేయడం లేదని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



విద్యుత్ షాక్‌తో మరణించిన సవర కామేష్

కాశీబుగ్గ: మందస మండలం చీపి పంచాయతీ రాజపురం గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమంలో కాటా మిషన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి వాహనంలో పనిచేస్తున్న వ్యక్తి మరణించాడు. సాబకోట పంచాయతీ భావనపురం గ్రామానికి చెందిన సవర కామేసు(40) సోమవారం బియ్యం పంపిణీలో మిషన్ చార్జింగ్ అయిపోవడంతో చార్జింగ్ పెడుతుండగా షాక్ కొట్టడంతో అక్కడిక్కడే మరణించారు. షాక్ కొట్టిన తర్వాత అతడిని హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు నిర్ధారించి అదే ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడికి భార్య సుభద్ర కుమార్తెలు మౌనిక, జ్యోత్స్న, వర్ధన్‌లు ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రణస్థలం: మండలంలోని పతివాడపాలెం జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వంతెనపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందారు. మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పతివాడపాలెం ఫ్లైఓవర్‌పైన సోమవారం తెల్లవారు జామున 3గంటల సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న దారిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వాహనం ఢీకొని చనిపోయాడు. తెల్లవారేంత వరకు ఈ ప్రమాదాన్ని ఎవరూ గమనించలేదు. మృతుడి వయసు 40–45 ఏళ్లు ఉంటుంది. ఎడమ చేతి మోచేయిపై నాగీసు– రూప అనే పచ్చబొట్టు ఉంది. ఎడమ పక్క ఛాతీపై అమ్మ అనే పచ్చబొట్టు ఉంది. కుడి మోచేయిపై రూప అనే పచ్చబొట్టు ఉంది. మెడలో నల్లని తాడుతో రుద్రాక్ష ఉంది. ఇతని వివరాలు ఎవరికైనా తెలిస్తే జేఆర్ పురం ఎస్ఐ నంబర్ 6309990850ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జే.ఆర్.పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.